# శ్రీ పరిణం శ్రీనివాసరావు స్మృతి

- కె. వేంకటరావు, హైదరాబాద్

డాక్టర్ పరిణం శ్రీనివాసరావుగారు స్వర్గస్థులై సుమారు సంవత్సరం కావస్తూంది. ఆత్మీయులందరిచేత పి.యస్.రావుగా పిలువబడే రావుగారు విజయనగరంలో జన్మించారు. స్కూలుఫైనల్ వరకు విద్యాభ్యాసము మచిలీపట్టణం హిందూ హైస్కూలులో జరిగినది. కళాశాల విద్య మహారాజ కళాశాల, విజయనగరంలో సాగినది. కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్య కొనసాగించి, అదే విశ్వవిద్యాలయంనుండి రసాయన శాస్త్రంలో పరిశోధనలు సలిపి డాక్టరేటు పట్టము పొందారు. అనంతరం విస్తృత పరిశోధనల కొరకు 1958లో అమెరికా వెళ్ళి, మూడు సంవత్సరముల తరువాత భారతదేశం తిరిగి వచ్చి పూనాలోను, భావనగర్ లోనూ జాతీయ వైజ్ఞానిక పరిశోధనా సంస్థలలో పూల్ ఆఫీసరుగా పనిచేశారు. 1960 దశకం చివరలో అమెరికా వలస వెళ్ళిపోయారు. పనిచేసి విస్తృతమైన అనుభవం గడించారు. కొన్ని విశ్వవిద్యాలయములలో ఆచార్య పదవులుకూడా నిర్వహించారు. 1980 దశకం ప్రారంభంలో న్యూయార్కు నగరానికి వచ్చి చివరి వరకు అక్కడనే స్థిరపడినారు. అక్కడ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వైద్యాలయంలో హృద్రోగములకు సంబంధించిన విభాగంలో పరిశోధనలు సాగించారు. కొన్ని పేటెంట్లను కూడ పొందారు. వాటిలో హృద్రోగ లక్షణములను గుర్తించే **CK-MB kit** ఒకటి. మొట్టమొదట దీనిని **Cal Biochem** సంస్థ అమెరికాలో ప్రవేశపెట్టెను. దరిమిలా భారతదేశంలో రెడ్డీలాబ్స్ అనుబధ సంస్థ **Stangen immuno Diagnostics** దీనిని ప్రవేశ పెట్టెను. రావుగారు అనేక అంతర్జాతీయ సమావేశములలో తమ పరిశోధనా పత్రములను సమర్పించారు. మరియు అనేక ప్రముఖ అంతర్జాతీయ వైజ్ఞానిక పత్రికలలో రావుగారి పరిశోధనా పత్రములను ప్రచురించారు. ఇది రావుగారి వృత్తిపరమైన పార్శ్వం.

విద్యార్థిదశనుండి పి.యస్.రావుగారికి తెలుగు సాహిత్యంమీద, ముఖ్యంగా కథాసాహిత్యం మీద అభిమానం కలదు. వీరి కథలు కొన్ని ఆనాటి స్వతంత్ర, ఆంధ్రప్రభ వార పత్రికలలో ప్రచురించబడినవి. విజయనగరం కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు, శ్రీ అవసరాల రామకృష్ణారావు, శ్రీ భమిడిపాటి రామగోపాలం రావుగారు సహాధ్యాయులు. తరువాత వీరిరువురు ప్రముఖ కథారచయితలుగా ప్రసిద్ధిపొంది, కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపుకు పాత్రులైనారు. వీరిరువురి ప్రభావం రావుగారిపై ఉన్నదనుటలో సంశయము లేదు. అమెరికాలో స్థిరపడిన పిమ్మట కూడా తెలుగులో రచనలు సాగించారు.. తెలుగువెలుగు, తెలుగుజ్యోతి పత్రికలలో రావుగారి రచనలు ప్రచురించబడుతూ ఉండేవి.

దీర్ఘకాల అస్వస్థత తరువాత తమ విశ్రాంత సమయాన్ని పుస్తక రచనకు వినియోగించారు. "అమెరికాలో మూడు తరాలు", "అమెరికాలో వృద్ధాప్యం" అను పుస్తకాలను రచించి ప్రచురించారు. సుమారు నాలుగు దశాబ్దాలు అమెరికాలో గడిపిన రావుగారు అక్కడి జీవన విధానాన్ని, సమాజాన్ని, ముఖ్యంగా భారతదేశంనుండి వలస వచ్చిన తెలుగువారిని క్షుణ్ణంగా అర్థం చేసుకొని, తమ అనుభవాలను పరిశీలించిన విషయాలతో సమన్వయము చేసి పై రెండు పుస్తకాలలో వివరించారు. ఇందులోని వ్యాసములు, కథానికలు, అంతకుముందు తెలుగుజ్యోతి, తెలుగువెలుగు మదలైన పత్రికలలో ప్రచురించబడినవి.

అమెరికాలో వివిధ రాష్ట్రాలలో ఉన్నటువంటి తెలుగు వారితో స్నేహసౌహార్థభావాలు పెంపొందించుకొని, వారితో సంప్రదింపులు జరుపుచు సత్సంబంధాలను ఏర్పరచుకొన్నారు. కొన్నిచోట్ల తెలుగు సంఘాలను స్థాపించి నూతనంగా వలస వచ్చిన తెలుగువారి సమస్యల పరిష్కారానికి ఒక వేదికనేర్పాటు చేసారు రావుగారు. పరస్పరం సహాయపడవలెనను సదుద్దేశంతో నలుగురుని ఒకచోట చేర్చి, సామూహిక చర్చలు, గోష్టులు నిర్వహించడంలో తోడ్పడుతూ ఉండేవారు. తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ పండుగలను తెలుగు కుటుంబాలవారితో జరుపుతూండేవారు. మరియు అక్కడ స్థిరపడినవారి పిల్లలకు మన సంప్రదాయాలను, తెలుగు భాషను పరిచయం చేయుటకు అవకాశాలు కల్పించేవారు.

పి.యస్.రావుగారి వ్యక్తిత్వం గురించి మూడు నాలుగు దశాబ్దాలనుండి అమెరికాలో స్థిరపడిన కొందరు ప్రసిద్ధులు ఈ విధంగా అభిప్రాయపడిరి. రావుగారు మొగమాటం లేకుండా ఉన్నదున్నట్టుగా సూటిగా ఈసు, దురుద్దేశం లేకుండా మాట్లాడటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన మాటలు వాస్తవాన్ని ప్రతిబింబిస్తూ హాస్యపూరితంగాను నిశితంగాను ఉండడం కూడా

ఒక విశేషం. కొద్ది సంవత్సరాల క్రితం రావుగారు రచించిన "అమెరికాలో మూడు తరాలు" అనే పుస్తకం హైదరాబాదు రవీంద్రభారతిలో ఆవిష్కరించబడిన సభలో విశిష్ట అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ డాక్టర్ కాకర్ల సుబ్బారావుగారు  పి.యస్.రావుగారి చమత్కార సంభాషణ గురించి ప్రస్తావిస్తూ ఒక ఉదంతాన్ని చెప్పారు. ఒకసారి అమెరికాలో జరిగిన తానా సభలకు ప్రముఖ సినీనటుడు పద్మభూషణ్ అక్కినేని నాగేశ్వరరావుగారు రావడం జరిగింది. సభా నిర్వాహకులు రావుగారిని నాగేశ్వరరావుగారికి పరిచయం చేశారు. ముందువరుసలో ప్రక్కనున్న వారిరువురు సంభాషణ కుప్రక్రమించినపుడు, నాగేశ్వరరావుగారిని, "మీరేంచేస్తుంటారు?" అని పి.యస్.రావుగారు అడిగారు! తెల్లబోవడం నాగేశ్వరరావుగారి వంతయింది.

అటువంటి పి.యస్.రావుగారు మార్చి 22, 2009 తెల్లవారుఝామున దివంగతులైనారన్న వార్త అటు కుటుంబ సభ్యులకు, ఇటు స్నేహబృందములకు దిగభ్రాంతి కలిగించినది. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినప్పటికి, ఆయన అందరి మనస్సులలో చిరకాలం నిలిచి ఉంటారనడంలో ఎటువంటి సంశయమునకు తావు లేదు.